వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

TE TL/26/A2635









## పెండింగ్ కేసులపై ఉక్కుపాదం

- దర్యాప్తు వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి
- గ్రేవ్, ప్రాపర్టీ కేసులపై ప్రత్యేక దృష్టి

5


హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:103 | 25-08-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల 3/-




## జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

- మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్‌పై హరీష్‌రావు ఫైర్

2



## శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

- లెజిస్లేచర్ మైనారిటీల సంక్షేమ కమిటీ, ఎస్సీ

2

## ప్రత్యర్థులపైనే ప్రతాపం

# అసమ్మతి వర్గంపై ఆచూతూచి ముందుకు..



- ముప్పేట దాడిని ఎదుర్కొంటున్న సీఎం
- రేవంత్‌నే లక్ష్యంగా విపక్షాల వ్యూహాలు
- సొంత పార్టీలో పెరుగుతున్న అసమ్మతి
- సీనియర్ల అసంతృప్తి సీఎంకు సవాలు
- ఆచితూచి అడుగులు

**తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రత్యర్థి పార్టీల నుంచి తీవ్ర రాజకీయ దాడి కొనసాగుతున్నా.. ఆయన మాత్రం దూకుడైన శైలితో వాటిని ఎదుర్కొంటున్నారు. అయితే బయట ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు సొంత పార్టీలోని అసమ్మతి వర్గం నుంచి వస్తున్న సవాళ్లు కొత్త చిక్కులు తెస్తున్నాయి. దీంతో విపక్షాలపై ప్రతాపం చూపుతున్న సీఎం..**



**హైదరాబాద్, ఆగస్టు 24:**
కాంగ్రెస్‌లోని అసమ్మతిపై మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రత్యర్థులే ప్రధాన లక్ష్యం**

తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ విమర్శలను కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్రీకరిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు చేయడంతో పాటు రేవంత్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. అయినప్పటికీ సీఎం వెనక్కి తగ్గకుండా తనదైన దూకుడుతో వాటికి సమాధానం ఇస్తున్నారు. ఒక అధికార నాయకుడిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి శక్తులు ఏకకాలంలో దాడి చేయడం ఆయనకు రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న ప్రాధాన్యతకు సంకేతంగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

**సొంత గూటిలోనే అసమ్మతి**

రేవంత్‌కు అసలు సవాలు మాత్రం కాంగ్రెస్‌లోనే ఎదురవుతోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో పెట్టుబడులను

# అడ్డుకునే కుట్ర



- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోదీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- అమెరికా టూర్ రద్దును ఊరికే వొదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా.. నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ మండిపాటు

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :**
పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అందుకు విరుద్ధంగా

మిగతా 2వ పేజీలో..

## సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి
- ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి

2

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి'
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు 48

**హైదరాబాద్, ఆగస్టు 24 :**
రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తూ, విద్యావ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరులకు నిరసనగా బీజేపీ పోరుబాట పట్టింది. రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' పేరిట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. ప్రజాస్వామ్యబద్ధంగా

మిగతా 2వ పేజీలో..



## కల్యాణలక్ష్మి కేసులో సర్కారుకు స్వల్ప ఊరట

- దివ్యాంగ వధువులకు సాయం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

2



# అధ్యక్షా పీఠం ఎవరికి?

## వెంకటాపురంలో పెరుగుతున్న ఉత్కంఠ

**వెంకటాపురం,ఆగస్ట్ 24,(డిడి9వార్త):** వెంకటాపురం మండలంలో కాంగ్రెస్‌లో మండల అధ్యక్ష పదవి వ్యవహారం రోజురోజుకూ ఉత్కంఠ రేపుతోంది. అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు పోటీ పడుతుండటంతో పార్టీలో అంతర్గత వర్గపోరు ముదురుతున్నట్లు తెలుస్తోంది. అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందన్న దానిపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ములుగు జిల్లాలోని పలు మండలాల్లో అధ్యక్ష పదవుల ప్రక్రియ పూర్తయినప్పటికీ వెంకటాపురం మండలంలో మాత్రం నిర్ణయం ఇంకా వెలువడకపోవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

6

- అధిష్ఠానం నిర్ణయంపైనే ఆశలు
- అధికార పార్టీలో అంతర్గత పోరు
- "నేనంటే నేనే అర్హుడిని" అంటున్న నేతలు
- పార్టీ పెద్దల వద్ద జోరుగా లాబీయింగ్
- అధ్యక్ష పదవిపై నేతల మధ్య పోటాపోటీ
- వర్గ విభేదాలతో వేడెక్కుతున్న వెంకటాపురం రాజకీయం
- పార్టీ పెద్దలకు చేరుతున్న అంతర్గత ఫిర్యాదులు
- అధ్యక్ష పీఠం కోసం ఎవరికి వారే వ్యూహాలు
- తమ వర్గం బలాన్ని చూపిస్తున్న ఆశావహులు
- అధిష్ఠానం మెప్పు కోసం నేతల ప్రయత్నాలు
- ఎవరి లాబీయింగ్ ఫలిస్తుందోనన్న ఆసక్తి
- అధ్యక్ష పీఠంపై సర్వత్రా ఉత్కంఠ
- హస్తవాసి ఎవరిదో..?
- వెంకటాపురం కాంగ్రెస్‌లో మండల అధ్యక్ష పంచాయతీ..
- వర్గ విభేదాలతో వేడెక్కుతున్న కాంగ్రెస్ రాజకీయాలు..
- ఆశావహుల లాబీయింగ్‌తో పెరుగుతున్న ఉత్కంఠ..
- అధిష్ఠానం వద్దకు చేరుతున్న ఫిర్యాదులు..

# ప్రత్యర్థులపైనే ప్రతాపం అసమ్మతి వర్గంపై ఆచూతూచి ముందుకు..

**మొదటిపేజీ తరువాయి**

కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేయడం పార్టీలో కలకలం రేపింది. పరకాల నియోజకవర్గం విషయంలోనూ సీఎం నిర్ణయాన్ని సుస్మిత బహిరంగంగా సవాలు చేయడం వివాదాన్ని మరింత పెంచింది. ఈ వ్యవహారంపై కొండా సురేఖకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేయడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేసింది.

**సీనియర్ల అసంతృప్తి**

కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అసంతృప్తి కూడా రేవంత్‌కు తలనొప్పిగా మారుతోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతలు ప్రభుత్వ వైఖరిపై బహిరంగంగా స్పందించడం పార్టీలో సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న నేతల రాజకీయ ప్రాధాన్యత, పదవుల ఆకాంక్షలను సమతుల్యం చేయడం సీఎంకు కఠిన పరీక్షగా మారింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత పెరుగుతోందనే భావన కూడా కొంతమంది సీనియర్లలో అసంతృప్తికి కారణమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అసమ్మతిపై ఆచితూచి అడుగులు**

విపక్షాలపై కఠినంగా వ్యవహరించే రేవంత్.. సొంత పార్టీలోని అసమ్మతి నేతల విషయంలో మాత్రం పరిస్థితిని బట్టి అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు పార్టీ క్రమశిక్షణను కాపాడాల్సిన అవసరం ఉండగా.. మరోవైపు సీనియర్ నేతలను పూర్తిగా దూరం చేసుకోకుండా సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అందుకే అసమ్మతిని కట్టడి చేయడంతో పాటు నేతలను నమ్మకంలోకి తీసుకునే ప్రయత్నమే రేవంత్‌కు రాజకీయంగా ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండు వైపులా సమతుల్యం**

విపక్షాలను ఎదుర్కొనే విషయంలో రేవంత్ తన రాజకీయ బలాన్ని ఇప్పటికే ప్రదర్శిస్తున్నారు. అయితే సొంత పార్టీలో అసమ్మతిని ఎంత సమర్థంగా చక్కదిద్దుతారన్నదే ఆయన నాయకత్వానికి అసలు పరీక్ష. కఠిన చర్యలు తీసుకుంటే అసమ్మతి మరింత పెరిగే అవకాశం ఉండగా.. పూర్తిగా చూసీచూడనట్లు వ్యవహరిస్తే అది విపక్షాలకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. దీంతో ప్రత్యర్థులపై దూకుడు.. అసమ్మతి వర్గంపై ఆచితూచి అడుగులు అనే ద్వంద్వ వ్యూహంతో రేవంత్ ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో ఆయన సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని, భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావని అన్నారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, ఫారెస్టు క్లియరెన్సులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్ల పల్లి శంకర్, ప్రేమ్‌సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమయి, మందుల సామేల్, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, లక్ష్మీకాంతరావు, రామ్‌దాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నాయకుడు హరీష్‌రావు విమర్శించారు. కానీ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందన్నారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా అని నిలదీశారు. యువత డిగ్రీలు, పిజీలు పూర్తి చేసి జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం మద్యం షాపులు, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోందన్నారు. సమయానికి యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నది అని ఎద్దేవా చేశారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మోసం.. ఫీజు రీయింబర్స్ మెంట్ మోసం.. రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయింది.. మేనిఫెస్టోలో చెప్పిన హామీలకు గతి లేకుండా పోయింది.. రేవంత్ పగ.. యువత దగా అన్నట్లుగా తయారైంది అని వ్యాఖ్యానించారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. రేవంత్ రెడ్డీ.. ఇదేనా మీరు చెప్పిన ప్రజా పాలన అని హరీష్‌రావు అడిగారు.




# రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర విధానాలు ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ--- ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. దిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా



స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనే అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనమండలి(లెజిస్లేచర్) మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ ప్రారంభ సమావేశం సోమవారం జరిగింది. తొలుత నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం పర్యవేక్షిస్తూ ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలతోపాటు అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూ□డ□ కులాలకు సంబంధించిన పథకాల మలులో



లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తాను కూడా 2008లో షెడ్యూల్డ్ కులాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఈ కమిటీ పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో సమన్వయంతో పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నానన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, లెజిస్లేచర్ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతారావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్, శాసనమండలి ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, మండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు హాజరయ్యారు.

# కల్యాణలక్ష్మి కేసులో సర్కారుకు స్వల్ప ఊరట

**హైదరాబాద్, ఆగస్ట్ 24:**

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగు లకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసా గుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రా ష్ట ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధా రణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ధర్నా చౌక్ వద్ద దీక్ష చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించినప్పటికీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే రామచందర్ రావు దీక్షకు దిగారు. ఫీజు బకాయిల సమస్య పరిష్కారమయ్యే వరకు ఈ పోరాటం ఆగదని పార్టీ స్పష్టం చేసింది. కార్యక్రమానికి విద్యార్థులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి ఐదు లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని, 'మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి' అంటూ విద్యార్థులు సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక□ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నప్పటికీ విద్యా వ్యవస్థను గాలికొదిలేశారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించి ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు చేర్చిందని, దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే ఏడాదికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన సర్కారు ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడమేగాక దురుసుగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాహుల్ గాంధీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు.. స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదో రాహుల్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ రేఖా శర్మ, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి అండ్ మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, రాష్ట్ర అధికార ప్రతినిధులు, పార్టీ పదాధికారులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్‌కు విద్యార్థుల ఉసురు తగలక తప్పదు : లక్ష్మణ్**

ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, గత బీఆరఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సుమారు రూ. 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయి, 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నానన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అనేది నిధుల కేటాయింపు మాత్రమే కాదు.. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, బలహీన వర్గాల బిడ్డల ఆత్మగౌరవ ప్రతీక అని ఆయన అన్నారు. పేదరికం నుంచి బయటపడేందుకు ఉన్నత విద్యను ఆశ్రయించిన యువతకు ఈ కాంగ్రెస్ సర్కార్ తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అశోక్ నగర్ రోడ్లలో రాహుల్ గాంధీ నిరుద్యోగులను, విద్యార్థులను కౌగిలించుకుని ఇచ్చిన బూటకపు హామీలను నమ్మి తెలంగాణ యువత మోసపోయిందన్నారు. నేడు న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తే ప్రభుత్వం విద్యార్థులపై లాఠీచార్జిలకు తెగబడుతున్నదన్నారు. ఉద్యమానికి ఊపిరిపోసిన విద్యార్థి లోకాన్ని అవమానించిన సీఎం రేవంత్‌కు ఆ బిడ్డల ఉసురు తగలక తప్పదన్నారు. విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకుని విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ఆ మంత్రిత్వ శాఖ బాధ్యతల నుంచి వైదొలగాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించిన అధికారులకు అభినందనలు

### 12వ వార్డు నాయకురాలు ఆవుల స్వర్ణ




**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి9 వార్త)**

అశోక్ నగర్ 12వ వార్డు పరిధిలో దీర్ఘకాలంగా వేధిస్తున్న విద్యుత్ లైన్ల సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులకు సమస్య తత్వార పరిష్కారానికి కృషి చేసిన స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు సర్పంచ్ పూనం కృష్ణ లకు ప్రత్యేక అభినందనలు 12వ వార్డు ప్రజల తరపున తెలియజేస్తున్నామని 12వ వార్డు మహిళా నాయకురాలు ఆవుల స్వర్ణ తెలిపారు. మెయిన్ రోడ్డులో గల విద్యుత్తు లైన్లో అత్యంత కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా తయారైన నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యే లతోపాటు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందించామని స్వర్ణ గుర్తు చేశారు. ప్రజల తరఫున విన్నపించిన సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు.

## రామాలయంలో పవిత్రాధివాసం నిర్వహణ

### నేడు భద్రాద్రి రామయ్యకు పవిత్రారోపణం



**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి9 వార్త )**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాల్లో భాగంగా పవిత్రాధివాసం కార్యక్రమంను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, అగ్నిప్రతిష్ట , చతుస్థానార్చనం తదితర ప్రత్యేక పూజలను వైదిక బృందం నిర్వహించారు. అనంతరం పవిత్రాలను అదివాసం చేసి శ్రీ సీతారామచంద్రస్వామి వారిని అందులోకి ఆవాహన గావించి పవిత్రాదివాసం నిర్వహించారు. అనంతరం శ్రీరామసేవ మండపలోని యాగశాల వద్ద పవిత్రాలకు పూజలు నిర్వహించారు. కాగా నేడు శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక స్నపనం నిర్వహించి ఆలయంలోని మూలమూర్తులతో పాటు రామాలయంలోని అందరూ దేవతామూర్తులకు, ఆలయ శిఖరాలకు పవిత్రాలను ధరింపజేస్తారు. ఈ కార్యక్రమంలో వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 30న పాల్వంచలో బెంచ్‌ప్రెస్ పోటీలు

### జిల్లా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి - జిల్లా కార్యదర్శి జివి రామిరెడ్డి

**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి9 వార్త )**



పాల్వంచలో ఈ నెల 30వ తేదీ ఆదివారం యూనిటీగోల్డ్స్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బెంచ్‌ప్రెస్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా క్రీడాకారులకు జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలోని క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయసు నిర్ధారణ కోసం తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు. ఉదయం 8 గంటలకు బాడీ వెయింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, క్రీడాకారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచితంగా టిఫిన్, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెమొంటో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి 9966588688, 9642120130 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## పేదల ఆకలి తీర్చి నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు

**బోనకల్,ఆగస్టు 24, (డీడీ9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా సోమవారం ముష్టికుంట్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులును లబ్ధిదారులకి సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు,సొసైటీ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామ ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మన ప్రజా ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కూడా రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని,రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇవ్వడం ద్వారా ఎంతో మంది పేదలు పొందుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిపిఓ వెంకటేశ్వర్లు,వార్డు మెంబర్లు షేక్ ముస్తఫా,చాంద్ పాషా,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంధం నాగేశ్వరరావు,నవీన్ యాదవ్, వాసు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# భద్రాచలం రోటరీ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు

- 109 క్లబ్‌లలో భద్రాచలం రోటరీకి ప్రత్యేక స్థానం
- సేవా కార్యక్రమాల విస్తరణకు పెద్ద ప్రాజెక్టు చేపడతాం: డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ్ సుదీర్ బిలానీ

**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి9 వార్త )**




డిస్ట్రిక్ట్ 3150 పరిధిలోని 109 రోటరీ క్లబ్‌లలో భద్రాచలం రోటరీ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ్ సుదీర్ బిలానీ అన్నారు. భద్రాచలం రోటరీ క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా భద్రాచలం రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, సభ్యులు సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, తద్వారా భద్రాచలం ప్రాంతంలో క్లబ్‌కు ప్రత్యేక స్థానం లభించిందని ఆయన అభినందించారు. భద్రాచలం ప్రముఖ పుణ్యక్షేత్రమని పేర్కొన్న గవర్నర్, తన అధికారిక పర్యటనలో భాగంగా ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో భద్రాచలం ప్రాంతానికి అవసరమైన సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. భద్రాచలం రోటరీ క్లబ్ ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా ఈ ప్రాంతంలో ఒక భారీ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి రోటరీ సేవలను మరింత విస్తరించేందుకు క్లబ్ సభ్యులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ అజీమ్, కార్యదర్శి పి. రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ, పూర్వ అధ్యక్షులు రాజా రెడ్డి , పలివెల.రవికుమార్, యశోద రాంబాబు, మోతుకూరి వీరయ్య, బాబు, కటుకూరి ప్రభాకర్, గుప్త, జకరయ్య, ఎం.డి. రఫీ, ముని కేశవ్, గడికొండల నాగేశ్వరరావు, వసంతరావు, దారా బాలాజీ, పి. మహాలక్ష్మి, మధు, వి. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వద్దు.. భవిష్యత్తే ముద్దు

- డ్రగ్స్‌కు బానిస కావొద్దు
- యువతకు డీఎస్పీ అరుణ్‌కుమార్ పిలుపు

**భద్రాచలం ఆగస్టు 24 ( డిడి9 వార్త )**




డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ బానిస కావద్దని డీఎస్పీ అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. భద్రాచలం జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి డీఎస్పీ అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ తొలుత సరదాగా లేదా స్నేహితుల ఒత్తిడితో ప్రారంభమైనా, క్రమంగా తీవ్ర వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటాయని హెచ్చరించారు. విద్యార్థులు చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. 4వ వార్డు మెంబర్, ఎస్ఎఫ్ఐ పట్టణ ఇన్‌చార్జి బండారు శరత్‌బాబు మాట్లాడుతూ.. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభను వెలికితీయాలని సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రభుత్వం, పోలీసు, విద్యాశాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యాసంస్థలు, హాస్టళ్లలో మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాధర్నా నోటీస్ అందచేసిన ఎంప్లాయి జేఏసీ ములుగు జిల్లా

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్,& టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీపోలు రాజు గారి ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, రెవిన్యూ మహేందర్ జీ, మరియు SP సుదీర్ రాంనాదన్ కేకన్,ఐపి ఎస్ గారిని దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న PRC అమలు, పెండింగ్లో ఉన్న 6 DA ల విడుదల,CPS రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరు,హెల్త్ కార్డులు అమలు మొదలగు వాటిపై ఆగస్టు 27 వ తేదీన కలెక్టరేట్ ముందు చేయబోయే మహాధర్నా నోటీస్ అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వి, యాకుబ్ రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, కార్యదర్శి కందుల జీవన్ కుమార్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బి రామ్మూర్తి, సారయ్య శ్యాం నాయక్, ప్రభాకర్ రావు, మరియు జేఏసీ సభ్యులు ప్రకాష్ రెడ్డి, అప్పలనాయుడు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, ప్రెసిడెంట్ సారయ్య, ధర్మానాయక్, రామ్మూర్తి,శ్యామ్ నాయక్,ప్రభాకర్ రావు గెజిటెడ్ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు,డాక్టర్ కొమురయ్య, సిద్ధార్థ రెడ్డి ప్రేమలత , పిట్టల రవి కుమారస్వామి, ఎండి రఫీక్, చంద్రశేఖర్, మహేందర్, గారు , తదితరులు పాల్గొన్నారు.



## హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్స్ , షూస్ మరియు క్రీడా సామాగ్రిని పంపిణీ

- ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

**మణుగూరు.ఆగస్టు 24 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు షెడ్యూల్ కులాల (SC)అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న బ్యాగ్స్ ,షూస్ , బెడ్ షీట్స్ మరియు క్రీడా సామాగ్రిని సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, 4వ వార్డు సభ్యులు ఉకే కృష్ణవేణి ,5వ వార్డు సభ్యులు కోలపిన్ని మానస తదితరులు సోమవారం నాడు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అన్నారు.

భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎ.రేవంత్ రెడ్డి గారికి మరియు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కె నరేష్ మరియు హాస్టల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## ఇది బడి కాదు... ఆదర్శ విశ్వవిద్యాలయం



- క్రమశిక్షణకు ప్రతీక.. ప్రగతికి వేదిక: భద్రాచలం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పనితీరు అద్భుతం
- భద్రాచలం జడ్పీ బాలికల పాఠశాలపై ఎంఈఓ శ్రీనివాసరావు ప్రశంసలు

**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి 9 వార్త ).**

భద్రాచలం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులు, విద్యార్థుల క్రమశిక్షణ, తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనా విధానం, కంప్యూటర్, గణితం, సైన్స్ ల్యాబ్ ల నిర్వహణ, మరుగుదొడ్ల పరిశుభ్రత తదితర అంశాలు విశ్వవిద్యాలయాన్ని సైతం తలపించేలా ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు ప్రశంసించారు. సోమవారం ఉదయం పాఠశాలలో అన్ని తరగతి గదులు, విద్యార్థులకు కల్పించిన వసతులు, ల్యాబ్ లు, మరుగుదొడ్లు తదితరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాల నిర్వహణపై ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పాఠశాలలో హరితహారం, పరిశుభ్రత, పచ్చదనం ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థి కేంద్రంగా తరగతి గది బోధనతో పాటు కిచెన్ గార్డెన్ ను నిర్వహించడం ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు 475 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ పాఠశాల ఆవరణలో ప్రశాంతమైన, నిశ్శబ్ద వాతావరణం నెలకొని ఉండటం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉదయం ప్రార్థనకు ముందే పాఠశాలకు చేరుకుని తమ తరగతి గదుల్లో ఇంటి పనిని పూర్తి చేసుకోవడం, క్రమశిక్షణతో మెలగడం, నిశ్శబ్దాన్ని పాటించడం చూపరులను సైతం ఆకట్టుకునేలా ఉందని తెలిపారు.

# సాదాబైనామా భూములను క్రమబద్ధీకరించాలి

- **పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలి.. తహసీల్దార్‌కు సీపీఐ వినతి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 24 (డీడీ9 వార్త):**

జనగామ గ్రామం (6వ డివిజన్)లో 2014కు ముందు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ, పెరటి భూములను భూభారతి చట్టం ప్రకారం క్రమబద్ధీకరించి రైతులు, కొనుగోలుదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని సీపీఐ 6వ డివిజన్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం రామగుండం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. జనగామలో పలువురు ప్రజలు, రైతులు తమ అవసరాల కోసం 2014కు ముందు సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసి ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించి మీ-సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో పలువురు 2020లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వపరమైన సాంకేతిక కారణాలతో అప్పట్లో వారి పేరిట భూముల క్రమబద్ధీకరణ జరగలేదన్నారు. అనంతరం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించడంతో 2025లో జనగామలో



నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు కూడా అందజేశారని తెలిపారు. సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ జరగలేదని, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నా సరైన సమాధానం లభించడం లేదని పేర్కొన్నారు. దీంతో పలువురు రైతులు, కొనుగోలుదారులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందలేక నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి జనగామలో 2014కు ముందు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ, పెరటి భూములను క్రమబద్ధీకరించి అర్హులైన రైతులు, కొనుగోలుదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని రమేశ్‌కుమార్ కోరారు.

# సింగరేణి కార్మికులకు రాఖీ ఆత్మీయ పలకరింపు

- **గనుల వద్ద కార్మికులకు రాఖీలు కట్టిన కందుల సంధ్యారాణి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 24 (డీడీ9 వార్త):**

రాఖీ పండుగ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సోమవారం ఆర్జీ-1 సింగరేణి గనుల వద్ద కార్మికులను ఆత్మీయంగా పలకరించారు. గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల చేతులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. అన్నా-చెల్లెలు, అక్క-తమ్ముళ్ల మధ్య



ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబంలో ఎన్ని విభేదాలు, కోపతాపాలు ఉన్నా రాఖీ పండుగ రోజున అందరూ ఒక్కటై సోదర భావంతో గడుపుతారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించిన ఆమె వారి క్షేమ సమాచారాన్ని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు కష్టనష్టాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్మికుల మధ్య ఐకమత్యం, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ సందర్భంగా కార్మికుల చేతులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంచిన బీజేపీ శ్రేణుల కార్యక్రమం గనుల వద్ద ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పింది. కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, కోడూరి రమేష్, బియ్యాల మహేందర్, పాకాల నరసింహారెడ్డి, బూడిద హర్ష, కొట్టే నరేష్, శ్రీనివాస్, చింతం అంజి, గంగరాజు, ఎల్తూరి సరిత, రాజయ్య, మీస వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై టీఆర్పీ పోరుబాట

- **వెంకటాపూర్ మండలంలో శ్రీకారం చుట్టిన తవిటి దిలీప్ కుమార్ ముదిరాజ్**
- **రైతులు, బీసీలు దళిత మైనార్టీల సమస్యలు తెలుసుకుంటున్న దిలీప్ కుమార్ ముదిరాజ్**
- **బీసీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి**
- **తీన్మార్ మల్లన్న స్ఫూర్తితో బీసీలు ముందుకు పోవాలి**

టి ఆర్ పి ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలీప్ కుమార్ ముదిరాజ్

ములుగు, ఆగస్టు 24, డీ డీ 9 వార్త : తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశం మేరకు ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలీప్ కుమార్ ముదిరాజ్ ప్రజా సమస్యలపై పోరుబాట పట్టారు. వెంకటాపూర్ మండల కేంద్రంలోని తాళ్లపాడు క్రాస్ వద్ద టీఆర్పీ జెండాను ఎగరవేశారు. అనంతపురం వెంకటాపురం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులు నిరుద్యోగ యువత విద్యార్థలను బట్టి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని, నోటిఫికేషనుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలని అన్నారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులకు, మహిళలకు పెన్షన్లు అందజేయాలని, అలాగే రేషన్ కార్డు లేని పేదలకు రేషన్ కార్డు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇల్లు లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. అందులో భాగంగానే బుధవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా ప్రజలు, రైతులు, మహిళలు బీసీ దళిత మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., బీసీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మెజార్టీగా ఉన్న బీసీలు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన చెందారు. మన హక్కుల కోసం మనం పోరాటాలు చేయక తప్పదని




ఆయన అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, దళిత మైనారిటీలు సంఘటితం కావాలని, రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తెలిపారు. పాలకులు మారిన, పార్టీలు మారిన, నిరుపేద ప్రజల జీవితాలు మారడం లేదని ఆయన పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీలకతీతంగా బీసీలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ రాజకీయ పార్టీకి ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని దిలీప్కుమార్ విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో తెలుసుకున్న ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానని దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, యూత్ విభాగం రాష్ట్ర నాయకులు పోలు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, మొగులపల్లి వినోద, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆజాం షేక్, మహమ్మద్ జాఫర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దురిశెట్టి విజయ్

# అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

**ఐటీడీఏ ఎస్డీసీ ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్**

**భద్రాచలం , ఆగస్టు 24 ( డిడి9 వార్త)**

సుదూర గిరిజన గ్రామాలు నుండి గిరిజన దర్బార్ కు వివిధ సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకునే గిరిజనులకు అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ డి సి ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఐటీడీఏ పీవో బి రాహుల్, ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఐటీడీఏ యూనిట్ అధికారుల సమక్షంలో ఆయన అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు



సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గిరిజన దర్బార్లో ఎక్కువ శాతం అర్జీలు సోలార్ ద్వారా తమ పొలాలలో బోరు బావులు తవ్వించుట కొరకు, రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు ఇప్పించుట కొరకు, పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కొరకు ,స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, యల్ టి ఆర్ భూ సమస్యలు, గిరిజన గ్రామాలలో కరెంటు సౌకర్యం కొరకు, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చేరడానికి శిక్షణలు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, పంట పొలాలకు నీరు అందించడానికి కరెంటు, బోరు మంజూరీ కొరకు, పోడు భూములకు పట్టాలు ఇప్పించుట మరియు ఆన్లైన్లో పొందుపరచుట కొరకు, రైతుబంధు రుణం ఇప్పించుట కొరకు, కిరాణా షాప్, ఫ్యాన్సీ స్టోర్ రుణాల కొరకు, మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారనీ ఆయన తెలుపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాంబాబు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏ డి ఎం హెచ్ ఓ సైదులు, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, హెచ్ ఈ ఓ లింగ నాయక్, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మలకు హాజరు అయిన జిల్లా భా.ర.స నాయకులు సోయం వీరభద్రం

**కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు గారి కుటుంబ సభ్యులను పరామర్శించి న సోయం వీరభద్రం**



**అశ్వరావుపేట:ఆగస్టు 24 (డిడి 9 వార్త)**

అశ్వరావుపేట (నియోజకవర్గం) దమ్మపేట (మండలం) దమ్మపేట లో కీర్తి శేషులు భారత కమ్యూనిస్ట్ పార్టీ( సిపిఐ) నాయకులు యార్లగడ్డ భాస్కరరావు గారి సతీమణి యార్లగడ్డ కుమారి గారి దశదినకర్మలకు హాజరు అయి చిత్రపటానికీ పులు వెసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలయజేసిన బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం . ఈ కార్యక్రమం లో సిపిఐ సీనియర్ నాయకులు కుకులకుంట సత్యానారాయణ,సి.పి.ఐ నాయకులు తంగేల్లముడి శివ,బెజవాడ రాము బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు యార్లగడ్డ బాబు,బి.ఆర్.ఎస్ యుత్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు..**



**మణుగూరు.ఆగస్టు 24 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై సమీక్షించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింప చేయండి

**సమాచార పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారికి సర్పంచ్ వినతిపత్రం**



**బోనకల్,ఆగస్టు 24, (డీడీ9 వార్త):**

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన బోనకల్ మండల రిపోర్టర్ మంద సత్యానందం ఆగస్టు మూడన రోడ్డు ప్రమాదంలో చనిపోగా సత్యనందం కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించాలని సోమవారం సమాచార పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి(డీపీఆర్వో)ను గ్రామ సర్పంచ్ మంద కరుణ కోరారు.ప్రభుత్వ గుర్తింపు కార్డు(అక్రిడేషన్) కలిగిన జర్నలిస్ట్ కుటుంబానికి ఇల్లు,సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు,ప్రభుత్వం సత్యానందం కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకొని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని సమాచార పౌరసరపాల శాఖ జిల్లా అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు,ఈ కార్యక్రమంలో మంద సత్యానందం సతీమణి మంద సుమంత,మాజీ జడ్పిటిసి,ఎంపీపీ కొమ్ము శ్రీనివాసరావు,సిపిఎం నాయకులు వల్లంకొండ సురేష్,పసుపులేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వరిలో సుడిదోమ నివారణపై రైతులకు అవగాహన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**

వరి పంటలో సుడిదోమ నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని జగిత్యాల వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సూచించారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో సుడిదోమ సమగ్ర యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రసన్న, వైష్ణవి, ఐశ్వర్య, నాగమణి, సింధు, స్వాతి మాట్లాడుతూ.. పొలంలో నీటిని మార్చి మార్చి ఆరబెట్టడంతో పాటు మోతాదుకు మించి నత్రజని ఎరువులను వాడకపోవడం ద్వారా దోమ ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. రైతులు క్రమం తప్పకుండా పొలాలను పరిశీలిస్తూ దోమను ప్రారంభ దశలోనే గుర్తించి శాస్త్రీయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చర్లలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆకస్మిక తనిఖీలు



**చర్ల, ఆగస్టు 24 (డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రంలోని మెడికల్ షాపులు, రక్త పరీక్ష కేంద్రాలలో సోమవారం డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మరియు జిల్లా టీకాకరణ అధికారి(డియో) డాక్టర్ ప్రతాప్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ షాపులు, ల్యాబ్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ తేదీ, అనుమతులు, ఇతర అవసరమైన పత్రాలను పరిశీలించారు. ల్యాబొరేటరీలలో వివిధ రకాల రక్త పరీక్షలకు సంబంధించిన పరీక్షల ధరలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డులు చేయాలని సూచించారు. మెడికల్ షాపులు, ల్యాబ్ లు నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల అనుమతులు తప్పనిసరిగా కలిగి ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం చర్ల ప్రజలను ఉద్దేశించి డా. ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హత కలిగిన వైద్యులు, అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, వివిధ రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీలైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని, ప్రైవేట్ వైద్యంపై ఆధారపడి ఆర్థికంగా నష్టపోకూడదని సూచించారు.

ఈ కార్యక్రమంలో డా. హారిక, మెడికల్ ఆఫీసర్ చర్ల, డిప్యూటీ ఎడ్యుకేషన్ మాస్ మీడియా అధికారి నాగలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కృష్ణయ్య, రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాఖీల తయారీలో మానసిక దివ్యాంగుల ప్రతిభ



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రం ( ఎన్ హెచ్ సి)మానసిక దివ్యాంగుల విభాగం (ఎంఆర్)లోని పిల్లలు రాఖీలను తయారు చేసి తమలోని నైపుణ్యాలను చాటుకున్నారు.మానసిక దివ్యాంగులకు స్వయం ఆధారిత జీవనానికి అవసరమైన చిన్నచిన్న నైపుణ్యాలపై శిక్షణ అందిస్తున్నారు.ఇందులో భాగంగా వివిధ డిజైన్లు, ఆకృతుల్లో సుమారు 250 ప్రత్యేక రాఖీలను ఆకర్షణీయంగా తయారు చేశారు. రాఖీల తయారీ ద్వారా పిల్లల్లో సృజనాత్మకతతో పాటు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ అందిస్తున్నారు.రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ ప్రత్యేక రాఖీలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని ఐడీఓసీ వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ స్టాల్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), డీఆర్డీవో దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్డీవో కె.పి. విజయలక్ష్మి, జిల్లా అధికారులు, డీపీఎమ్ లు సందర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాఖీలు తయారు చేసిన ఎంఆర్ పిల్లలను మనస్ఫూర్తిగా అభినందించారు.మానసిక దివ్యాంగుల ప్రతిభను జిల్లా అధికారులు ప్రశంసిస్తూ రాఖీలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు. పిల్లలు స్వయంగా తయారు చేసిన రాఖీలకు మంచి ఆదరణ లభించడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం ఎన్ హెచ్ సిలోని పిల్లలు అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, ఎల్ బీ), డీఆర్డీవో, జిల్లా అధికారులకు రాఖీలు కట్టి తమ కృతజ్ఞతలు తెలిపారు.మానసిక దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగించేలా ప్రోత్సహిస్తున్నామని అధికారులు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త)**

: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. వివిధ సమస్యలపై ప్రజలు తమ ఫిర్యాదులను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించాలని ఆయన సూచించారు.అర్హత కలిగిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాలని ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్, డీఆర్ఓ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులపై ఉక్కుపాదం





- **దర్యాప్తు వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి**
- **గ్రేవ్, ప్రాపర్టీ కేసులపై ప్రత్యేక దృష్టి**
- **బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రోహిత్‌రాజు**

**భద్రాచలం, ఆగస్టు 24 ( డిడి9 వార్త )**

పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యతతో దర్యాప్తు జరిపి సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేయాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు పరిష్కారం చూపేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. వివిధ వర్టికల్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది విధులు, పనితీరుపై ఆరా తీశారు.

**కేసుల దర్యాప్తుపై సమీక్ష**

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన యూఐ, గ్రేవ్, ప్రాపర్టీ కేసుల వివరాలను ఎస్పీ సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కేసులో ఆధారాలను పక్కాగా సేకరించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. దొంగతనం, ప్రాపర్టీ కేసుల్లో నిందితులను గుర్తించడంతో పాటు చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

**సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి**

స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకుని నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు.

**గంజాయి అక్రమ రవాణాపై నిఘా**

పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

**సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం**

పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు ఎం.ప్రసాద్, రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపటండి

- **గ్రామంలో ప్రభుత్వ స్థలాల కబ్జా,అక్రమ మట్టితోలకాలపై జెసికి ఫిర్యాదు**
- **స్పందించిన జే సి...వివరాల కోసం తాసిల్దార్ కు ఫోన్**
- **పంచాయతీ నిధులు దుర్వినియోగం,ప్రభుత్వ ప్రభుత్వ**
- **స్థలాల కబ్జాపై డిఎల్ పీవో ను విచారణ కి ఆదేశం**

**బోనకల్,ఆగస్టు 24, (డీడీ9 వార్త):**

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ సర్పంచ్ భర్త ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా జెసిబిలతో ట్రాక్టర్లతో అక్రమ మట్టి తోలకాలు జరుపట గురించి మరియు సుమారు 15 లక్షల పంచాయతీ నిధులను నాలుగు నెలల కాలంలో ఎటువంటి ఎంబీ రికార్డులు లేకుండా డ్రా చేయడం గురించి ప్రభుత్వ స్థలాన్ని అమ్మడం గురించి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో సోమవారం గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది. మా గ్రామంలో సుమారు 10 నుండి 15 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. అట్టి భూమి నందు గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ పాలకవర్గం తెలవకుండా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సర్పంచ్ భర్త ఆదివారం చూసుకుని జెసిబిలు ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా వందలాది ట్రిప్పుల మట్టితోలకాన్ని జరిపాడు. అదేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తే రోడ్డుకు తోలుతున్న పంచాయతీ తీర్మానం ఉంది అని చెప్పాడు. గ్రామపంచాయతీ నిధులతో అంతర్గత రోడ్లకు తోలాల్సిన మట్టిని అక్రమంగా ఊరి బయట గల ఒకరిద్దరు రైతుల స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తిని అక్రమంగా తరలించాడు. సర్పంచ్ భర్త గ్రామంలో అలజల్లు సృష్టిస్తూ గ్రామ పంచాయతీ విషయాల్లో జోక్యం చేసుకుంటూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నాడు. ఇదంతా పంచాయతీ కార్యదర్శి కనుసనల్లోనే జరగటం విశేషం. అక్రమ మట్టి



తోలకాలను నిలిపివేసి అక్రమం మట్టి తోలిన జెసిబిని ట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలనిమా గ్రామంలో గత 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో కొన్ని ప్లాట్లు ప్రభుత్వ భవిష్యత్తు అవసరాల రీత్యా ఖాళీగా ఉంచబడ్డాయి. గత పాలకవర్గం అట్టి ఖాళీ ప్లాటుకు ప్రభుత్వ నిధులతో మట్టితోలించి బీసీ కమ్యూనిటీ హాల్ లేదా వివో బిల్డింగు ఆ స్థలాన్ని వినియోగించాలని ఉంచింది. నూతన పాలకవర్గం ఏర్పడిన నెల రోజులకే సర్పంచ్, సర్పంచి భర్త, ఉప సర్పంచ్ కుమ్మక్కై అట్టి స్థలాన్ని వారి పార్టీకి అనుకూలమైన వ్యక్తికి రెండు లక్షలకు అమ్ముకున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి కి తెలిసి కూడా నోరుమెదపడం లేదు. ప్రభుత్వ భూమిని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని జెసి గారిని కోరడం జరిగింది. స్పందించిన ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, వార్డు మెంబర్లు దారెల్లి వెంకటేశ్వర్లు, బోయినపల్లి స్వర్ణ, తుపాకుల కవిత, దారెల్లి రమణమ్మ, మరియు గ్రామస్తులు బోయినపల్లి నరేష్, తుపాకుల నరేష్, మస్తాన్, తాళ్లూరి రామారావు, కోమ్మినేని వెంకటేశ్వర్లు, తెలపైన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన జుక్కల్ ఎమ్మెల్యే

- **గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు.. ఇద్దరు అరెస్ట్**
- **19 కేజీల గంజాయి స్వాధీనం.. విలువ రూ.9.41 లక్షలు**
- **అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు: భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్**

**భద్రాచలం, ఆగస్టు 24 (డిడి9 వార్త)**

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను భద్రాచలం పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 19 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.9,41,500గా పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణ ఎస్సై వి. సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ అలియాస్ అజయ్ సైని, ఉజ్వల్ అలియాస్ ఉజ్వల్ సైనిగా గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మహమ్మద్ అష్రఫ్ ఖురేషి అనే వ్యక్తి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను ఉంచి, బెంగళూరులోని సతీష్ అనే వ్యక్తికి అందజేయాలని సూచించినట్లు నిందితులు పోలీసులకు వెల్లడించినట్లు తెలిపారు. దీంతో వారు సుకుమ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా పోలీసులు వారిని పట్టుకున్నారు నిందితుల వద్ద నుంచి 19 కేజీల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం వారిని భద్రాచలం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ యం. నాగరాజు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ




సందర్భంగా డీఎస్పీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని కోరారు.

గంజాయి అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి పాల్పడేవారితో పాటు అక్రమ రవాణాకు సహకరించే వారిపైనా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం, రవాణా, నిల్వకు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# రేగా కు ఘన స్వాగతం పలికిన నియోజకవర్గ ప్రజలు..

- దారి పొడవునా పూలవర్షం కురిపిస్తూ.. నీరాజనం పలికిన పార్టీ శ్రేణులు.

**మణుగూరు.ఆగస్టు 24 (డి డి 9వార్త)**

కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటంలో విజయం సాధించి, పెట్టిన కేసులన్నీ రాజకీయ కుట్రతో పెట్టినవని హైకోర్టు కేసు కొట్టేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బయ్యారం క్రాస్ రోడ్డు నుండి అశేష ప్రజానీకం,అభిమానులు,కార్య కర్తలు వెంటరాగా మణుగూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జై కేసీఆర్, జై తెలంగాణ, జై రేగా నినాదాలతో పట్టణమంతా హోరెత్తించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణం లోని కిన్నెర కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఒక మహిళను అడ్డుపెట్టుకొని ఇలాంటి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైనది కాదు అని హెచ్చరించారు. లైంగిక వేధింపుల కేసు వల్ల తన కుటుంబం ఎంతగానో మనస్తాపం అనుభవించిందని, కానీ నిజం గెలుస్తుందనే నమ్మకంతో ముందుకు సాగామన్నారు. పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు చూపిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమేనని నేను మొదట్నుంచే చెబుతానే ఉన్నానని ఆయన పేర్కొన్నారు. నిజం, న్యాయం మీద ఉన్న విశ్వాసంతోనే న్యాయపోరాటం చేశాను, చివరకు సత్యమే గెలిచింది. ప్రజల ఆశీర్వాదం,పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అందించిన అండతో ఈ పోరాటంలో నిలబడగలిగాను అని ఆయన అన్నారు. రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు,కానీ తప్పుడు ఆరోపణలు చేసి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.ఇకపై ప్రజాసేవకే మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని అన్నారు.ఇలాంటి అక్రమ కేసులకు భయపడే పరిస్థితి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రభుత్వం లోకి వచ్చిన తర్వాత ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటినుంచి మరింత ఉత్సాహంతో ప్రభుత్వానికి ప్రతి క్షణం వారు ఇచ్చిన హామీలపై గుర్తు చేస్తూ ధర్నాలు పోరాటాలు సాగిస్తూ ప్రజల పక్షాన నిలబడతామని సూచించారు. ఇకనైనా ప్రభుత్వం నిద్ర వీడి ఇలాంటి అక్రమ కేసులు కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన అన్నారు..



**కల్యాణలక్ష్మి నిధులను వెంటనే విడుదల చేయాలి..**

పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. తొలుత రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకాన్ని అనంతరం రూ.1,00,116కు పెంచి పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో నిధులు అందక పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. హైకోర్టు అంశంపై ప్రభుత్వం స్పందించాలి.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం సరికాదు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్ల సమస్య మరింత జాప్యమవుతోందని రేగా కాంతారావు గారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన పేదలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్యాణలక్ష్మి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ నిధులు తక్షణమే విడుదల చేయాలి..

**తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న లబ్ధిదారులు.**

**మణుగూరు.ఆగస్టు 24 (డి డి 9వార్త )**

మణుగూరు మండల పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం (100 రోజుల పని కార్డు) ద్వారా అందవలసిన రూ. 60,000/- ఆర్థిక సహాయం విడుదలలో జరుగుతున్న తీవ్ర ఆలస్యంపై సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం నాడు నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో మణుగూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి హామీ అనుసంధానం ద్వారా మంజూరవ్వాల్సిన సొమ్ము జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

పెండింగ్ పనులకు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నీకల్ అసిస్టెంట్, అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ల సమన్వయ లోపం, జియో ట్యాగింగ్ చేయకపోవడం, మస్టర్ రోల్స్ సమర్పించ కపోవడం మరియు డేటా ఎంట్రీ ప్రాసెస్ ఆలస్యం వల్ల లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అప్పులు చేసి ఇండ్ల నిర్మాణం చేపట్టిన నిరుపేద లబ్ధిదారులు, సొమ్ము వేళకు అందక తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదర్కొంటు న్నారని వివరించారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, పెండింగ్‌లో ఉన్న జియో ట్యాగింగ్, మస్టర్ ప్రాసెస్ పనులను పూర్తి చేయించాలని, అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ఉపాధి హామీ నిధులను త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అధ్యక్షా పీఠం ఎవరికి?

**వెంకటాపురం,ఆగస్ట్ 24,(డిడి9 వార్త):**

మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఫుల్ డిమాండ్ ఏర్పడటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. నూతన మండల అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించడంతో అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.అధ్యక్ష పదవిపై గురిపెట్టిన నాయకులు ఎవరికి వారుగా తమ వర్గాలను కూడగట్టుకుంటూ అధిష్ఠానం వద్ద లాబీయింగ్‌కు తెరలేపినట్లు తెలుస్తోంది. "నేనే అర్హుడిని.. పార్టీ కోసం పనిచేశాను.. కార్యకర్తలకు అందుబాటులో ఉంటాను" అంటూ తమకు అనుకూలంగా ఉన్న నాయకులతో పార్టీ పెద్దల వద్ద మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.అయితే అధ్యక్ష పదవి కోసం ఆశావహులు పెరగడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తీవ్రతరం అవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే నేతల మధ్య ఉన్న వర్గ విభేదాలు అధ్యక్ష పదవి ఎంపిక వ్యవహారంతో మరింత బహిర్గతమవుతున్నాయని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.మరోవైపు ఒక వర్గం నేతపై మరో వర్గం పార్టీ పెద్దలకు ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం.



అధ్యక్ష పదవికి ఎవరు అర్హులు, ఎవరి వెంట ఎంతమంది కార్యకర్తలు ఉన్నారు, గతంలో పార్టీ కోసం ఎవరు ఎంతమేర పనిచేశారు అనే అంశాలను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లగలిగే నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయం కొందరు సీనియర్ నాయకుల నుంచి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. అయితే ఆశావహుల సంఖ్య పెరగడంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, పార్టీ బలోపేతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆశావహులు ముఖ్య నాయకుల వద్ద మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**సీనియర్లలో సెగ.. కార్యకర్తల్లో అసంతృప్తి**

కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వకుండా వ్యక్తిగత అనుచరులకు పదవులు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల అధ్యక్ష పదవి ఎంపిక విషయంలో ఏర్పడిన విభేదాలు ఇప్పటికే ఎమ్మెల్యే, జిల్లా స్థాయి ముఖ్య నాయకుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే నాయకత్వ ఎంపికపై అసంతృప్తి పెరగడం కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

**స్థానిక ఎన్నికల వేళ కీలక నిర్ణయం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల అధ్యక్షుడి ఎంపికతో పాటు గ్రామ కమిటీల ఏర్పాటు కాంగ్రెస్‌కు అత్యంత కీలకం. నాయకుల మధ్య విభేదాలు కొనసాగితే క్షేత్రస్థాయిలో పార్టీపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

అన్ని వర్గాలను సమన్వయం చేస్తూ పార్టీకి విధేయుడైన, కార్యకర్తలందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడం అధిష్ఠానానికి ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. ఎవరు హస్తవాసి..? ఎవరి వైపు అధిష్ఠానం మొగ్గు..? వర్గపోరుకు ఎలా చెక్..? అనే ప్రశ్నలు వెంకటాపురం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : ఎంపీడీఓ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**

ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.నర్సయ్య ఆదేశించారు. సోమవారం సాలూర రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి వ్యవసాయ శాఖకు సంబంధించి 2, నీటిపారుదల శాఖకు 1 దరఖాస్తు చొప్పున మొత్తం మూడు వినతులు వచ్చాయన్నారు.

# తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చలో ఉట్నూర్. తరలి వెళ్లిన ఆదివాసులు

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం**



**( డిడి 9 వార్త ) ఆగష్టు 24**

తలమడుగు మండలంలో పలు గ్రామాల ఆదివాసులు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ఉట్నూరు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసి నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో తమకు జరుగుతున్న అన్యాయాలను మరియు ఆదివాసులకు భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన అనేక చట్టాలున్నప్పటికీ కొందరు స్వార్థ రాజకీయ నాయకుల వల్ల చట్టాలు సరిగ్గా అమలు కాలేక. ఆదివాసులకు అనేక అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు గిరిజనుల భూమిని. గిరిజనేతరులు కొనకుండా నిషేధించే చట్టాలున్నా అధికారులు నిర్లక్ష్యంతో అమలు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసులకు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లలో తగిన ప్రాధాన్యత దక్కడం లేదని వారు ఆరోపించారు ఏజెన్సీ ప్రాంతంలో నివసించే తమకు న్యాయం జరగాలంటే తమ అందరం కలిసికట్టుగా పోరాడి తమ హక్కులతో పాటు సంస్కృతిసంప్రదాయాలను కాపాడుకుంటామని వారు తెలిపారు

# డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాలో ఇప్పటివరకు గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, వివిధ అసంగతతలు, ఇతర వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, ఇతర అంశాలకు సంబంధించి నోటీసులు జారీ చేయడం, సంబంధిత పత్రాలను స్వీకరించడం, క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ నిర్వహించడం, వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరించే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను పరిశీలించి, అవసరమైన చోట క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత విధానంలో సమర్పించాలని కోరారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సహకారం అందించాలని కోరారు.అనంతరం ముసాయిదా ఓటరు జాబితా ప్రతులను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఏకచక్రేశ్వరాలయానికి పాదయాత్రగా తరలిన భక్తజనం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**

పవిత్ర శ్రావణ మాస సోమవారాన్ని పురస్కరించుకుని సాలూర మండలం హున్సా గ్రామం భక్తి సాగరంలో మునిగితేలింది. పరమశివుడి దివ్యానుగ్రహం కోసం, సకల జనుల క్షేమాన్ని కాంక్షిస్తూ హున్సా గ్రామానికి చెందిన శివభక్తులు సోమవారం బోధన్‌లోని చారిత్రాత్మక శ్రీ ఏకచక్రేశ్వర శివాలయానికి మహా పాదయాత్రగా తరలివెళ్లారు. ఉదయాన్నే గ్రామంలోని స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు 'హర హర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ శివనామస్మరణ చేస్తూ కాలినడకన బయలుదేరారు. దారి పొడవునా భక్తుల జపాలు, మంత్రోచ్చారణలతో పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభతో మార్మోగిపోయాయి. వయోభేదం లేకుండా మహిళలు, యువకులు, పెద్దలు అత్యంత నిష్ఠ నియమాలతో ఈ పాదయాత్రలో పాల్గొని తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. బోధన్ పుణ్యక్షేత్రంలోని శ్రీ ఏకచక్రేశ్వరాలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో సాదర స్వాగతం లభించింది. పవిత్ర జలాలు, పాలతో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, విశేష ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పాదయాత్రగా వచ్చి భోళాశంకరుడిని దర్శించుకుని పూజలు చేయడం వల్ల సమస్త పాపాలు తొలగిపోయి, కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు చేకూరుతాయని భక్తులు పరవశించిపోయారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ వైభవంగా జరిగింది.

## శివనామస్మరణతో మార్మోగిన ఆత్మలింగేశ్వరం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని బైపాసు రోడ్డు పాండుచెరువు ఒడ్డున గల ప్రసిద్ధ శ్రీ ఆత్మలింగేశ్వరాలయం శ్రావణమాస రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, సాంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, విశేష బిల్వార్చనలు ఘనంగా జరిగాయి. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. భక్తులు దీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసంలో పరమశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధకాగలవని అర్చకులు పేర్కొన్నారు.

## బీర్కూర్ మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో నూతన మరుగుదొడ్లు ప్రారంభం



**బాన్సువాడ, ఆగస్టు 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను బీర్కూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు యామ రాములు, బీర్కూర్ ఉప సర్పంచ్ పరమేశ్వర్ పంతులు ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా యామ రాములు, పరమేశ్వర్ పంతులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు సహకారం అందిస్తున్నారని అన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు.పాఠశాలల్లో పారిశుద్ధ్య సౌకర్యాలు మెరుగ్గా ఉంటే విద్యార్థుల ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు మరుగుదొడ్లను పరిశుభ్రంగా వినియోగించుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఎమ్మెల్లే దృష్టికి తీసుకువెళ్లి ముందుకు సాగుతామని తెలిపారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాండ్ల రఘు, యువనాయకులు మియాపురం శశికాంత్, డీసీసీ కార్యదర్శి మేకల విట్టల్, అంబిలి బస్వారాజ్ వార్డుసభ్యులు కొరిమె రఘు, ప్రశాంత్, దుంపల రాజు, ప్రిన్సిపాల్ గోపీచంద్, ఉపాధ్యాయులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా ఇప్పించాలని ఆర్ డీవోకు రైతుల వినతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**

ఫార్మర్ ఫర్టిలైజర్ యాప్‌లో వస్తున్న సాంకేతిక సమస్యల వల్ల తమకు యూరియా అందడం లేదని, సొసైటీ ద్వారా మ్యాన్యువల్‌గా పంపిణీ చేయించాలని కోరుతూ బోధన్ కు చెందిన రైతులు సోమవారం రెవెన్యూ డివిజినల్ అధికారిణి విజయ కుమారిని కలసి వినతిపత్రం సమర్పించారు. బోధన్ పట్టణంలోని దుద్యాల్, దౌత్యాల్, పాండు, బెల్లాల్, చెక్కి తర్వాలు గ్రామాల పేర్లు యాప్‌లో చూపించకపోవడంతో సొసైటీలో స్టాక్ ఉన్నప్పటికీ సిబ్బంది ఎరువులు ఇవ్వడం లేదని చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు యూరియా అత్యంత అవసరమైన తరుణంలో యాప్ సమస్య కారణంగా సరఫరా నిలిచిపోవడం దారుణమని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోయిందని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సాంకేతిక లోపాన్ని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పట్టాదారు పాసుబుక్కుల ఆధారంగా మ్యాన్యువల్‌గా యూరియా బస్తాలు ఇప్పించి ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మిలాద్ -ఉన్-నబీని ప్రశాంతంగా నిర్వహించాలి

**బాన్సువాడ, ఆగస్టు 24డిడి9 వార్త):**

మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రాములు మాట్లాడుతూ పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, వివిధ వర్గాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజలు పరస్పర మత గౌరవాన్ని కాపాడుతూ శాంతియుతంగా పండుగను నిర్వహించాలని ఎస్సై కోరారు.

# వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి








- **రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం–2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్‌లోని తన ఛాంబర్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వన మహోత్సవం–2026 లక్ష్య సాధనపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను కూడా వేగంగా పూర్తి చేసి 100 శాతం సాధించాలని సూచించారు.శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు నిర్దేశిత లక్ష్యాలను పూర్తిగా చేరుకోలేకపోయామని, ఇకపై కురిసే వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకుంటూ సెప్టెంబర్ చివరి వారం నాటికి వంద శాతం లక్ష్యాలను సాధించాలని మంత్రి సూచించారు.అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించిన ప్రాంతాలకు అనుగుణంగా ఎంపిక చేసిన మొక్కలను నాటాలని తెలిపారు.మొక్కలు నాటడమే కాకుండా అవి బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.పశువులు, ఇతర జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్‌లలో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వన మహోత్సవం లక్ష్యాల సాధనపై ప్రజలకు అవగాహన కల్పించేలా మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు.జిల్లా కలెక్టర్ కుమార్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో వన మహోత్సవం–2026లో భాగంగా 24.66 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 17.78 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాగత ప్రాంగణాల భద్రతకు ప్రత్యేక చర్యలు

- **విచ్చలవిడి కుక్కల నియంత్రణ, రేబిస్ నివారణకు సమన్వయ చర్యలు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్లు, రవాణా డిపోలు, రైల్వే స్టేషన్లలో ప్రజలు, విద్యార్థులు, సిబ్బంది, సందర్శకుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా సంస్థాగత ప్రాంగణాల భద్రతా కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ పర్యవేక్షణలో, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి సభ్య/కన్వీనర్‌గా కమిటీ కార్యకలాపాలను సమన్వయం చేయనున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ సంస్థాగత ప్రాంగణాల్లో విచ్చలవిడి కుక్కల నియంత్రణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలు, విద్యార్థులు, సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కుక్కల ప్రవేశాన్ని అరికట్టేందుకు ప్రాంగణాల్లోని గేట్లు, ప్రహరీ గోడలు, చెత్త నిర్వహణ ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంబంధిత ఆసుపత్రులు, విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్లు, రవాణా డిపోలు, రైల్వే స్టేషన్లలో నోడల్ అధికారులను నియమించి భద్రతా చర్యలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. విచ్చలవిడి కుక్కల నియంత్రణలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు అవసరమైన ప్రాంతాల్లో స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, మానవీయ నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. పశుసంవర్ధక, పశువైద్య శాఖ అధికారులు స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుని సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు.

**రేబిస్ నివారణకు ప్రత్యేక చర్యలు**

రేబిస్ నివారించగల వ్యాధి అయినప్పటికీ లక్షణాలు ప్రారంభమైన తర్వాత అత్యంత ప్రమాదకరంగా మారుతుందని అధికారులు తెలిపారు. కుక్క కాటు లేదా గీతలు పడిన సందర్భాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సేవలు పొందాలని సూచించారు.అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ), రేబిస్ ఇమ్యూనో గ్లోబ్యులిన్ (ఆర్‌ఐజీ)తో పాటు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించారు. వ్యాక్సిన్ నిల్వలు, సరఫరా, సేవల లభ్యతను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు.




**విస్తృత అవగాహన కార్యక్రమాలు**

విద్యార్థులు, సిబ్బంది, రోగులు, సందర్శకులు, రవాణా సిబ్బందికి విచ్చలవిడి కుక్కల పట్ల సురక్షితంగా వ్యవహరించడం, కుక్క కాటు జరిగిన వెంటనే సమాచారం ఇవ్వడం, తక్షణ వైద్య చికిత్స పొందడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఏదైనా సంస్థాగత ప్రాంగణంలోకి విచ్చలవిడి కుక్కలు ప్రవేశించినా, దాడి లేదా కాటు ఘటన జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన సరిదిద్దే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**నెలవారీగా సమీక్ష**

జిల్లా సంస్థాగత ప్రాంగణాల భద్రతా కమిటీ నెలకు ఒకసారి లేదా అవసరాన్ని బట్టి మరింత తరచుగా సమావేశమై వివిధ శాఖలు, సంస్థలు చేపడుతున్న చర్యల అమలును సమీక్షించనుంది.క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యల ప్రభావాన్ని అంచనా వేయనుంది. సంబంధిత శాఖలు, సంస్థల అధిపతులు చేపట్టిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, జరిగిన ఘటనల వివరాలతో కూడిన అమలు నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ద్వారా కమిటీ సభ్య/కన్వీనర్‌కు సమర్పించాలని సూచించారు.కుక్క కాటు లేదా గీత పడిన సందర్భంలో వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం లేదా ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. గాయాన్ని వీలైనంత త్వరగా సబ్బు, ప్రవహించే నీటితో బాగా కడిగి, వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ చికిత్స తీసుకోవాలని సూచించారు. సకాలంలో సరైన వైద్య చికిత్స పొందడం ద్వారా రేబిస్‌ను నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలునిర్వహించాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.కామారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని సూచించారు.బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు ముందస్తుగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.గ్రామ, వార్డు సభల వద్ద ఫారం–6, ఫారం–7, ఫారం–8 తదితర అవసరమైన దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని పేర్లను చదివి వినిపించడంతో పాటు జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని తెలిపారు.






01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం–6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉంటే ఫారం–8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించాలని తెలిపారు.అర్హత లేకపోయినా ఓటరు జాబితాలో పేర్లు నమోదై ఉన్నవారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ఫారం–7 ద్వారా అభ్యంతరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మ్యాపింగ్ కాని, అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.ప్రతి నోటీసులో విచారణ తేదీ, సమయం, ప్రదేశాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు.నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోలతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభలకు సంబంధించిన పూర్తి వివరాలను డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని తెలిపారు.ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్, తహసీల్దార్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలి

- 22ఏ భూచిక్కుల పరిష్కారానికి చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**



విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు రైతులకు అడుగడుగునా ఎదురవుతున్న 22ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బోధన్‌లోని ప్రభుత్వ మధుమాలంచ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలించిన అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, ఫలితాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించాల్సిన బాధ్యత అధ్యాపకులపైనే ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 28 లక్షల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, ఉచిత యూనిఫారాలు అందజేస్తూ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ఏడాది 59 శాతం ఉత్తీర్ణత మాత్రమే రావడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, లెక్చరర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అదనపు తరగతులు నిర్వహించడం ద్వారా 100 శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని నిర్దేశించారు. కళాశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాన్ని తనిఖీ చేసి, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అంశాలపై మాట్లాడుతూ... రైతాంగానికి ఇబ్బందికరంగా మారిన 22ఏ భూముల చిక్కులను పరిష్కరించేందుకు సర్కారు సిద్ధంగా ఉందన్నారు. 3 ఎకరాలు లేదా 50 ఎకరాల విస్తీర్ణంలో కేవలం 3, 4 గుంటల ప్రభుత్వ స్థలం ఉందనే నెపంతో మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల నిజమైన రైతులు తమ భూములను అమ్ముకోలేక, బ్యాంక్ రుణాలు పొందలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గారి ఆలోచనలకు అనుగుణంగా ఎటువంటి వివాదాలు లేని ప్రైవేట్ భూములను తక్షణమే నిషేధిత జాబితా నుంచి వేరు చేసి క్లియరెన్స్ ఇవ్వాలని తహశీల్దార్లు, సబ్-రిజిస్ట్రార్లు, వీఆర్వోలకు సూచించారు. సర్వేలు, రిజిస్ట్రేషన్ల పేరుతో రైతులను మభ్యపెట్టినా, విధుల్లో అలసత్వం వహించినా సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందిపై కఠినమైన పరిపాలనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్‌పర్సన్ తాహిర్ బిన్ హమ్దాన్, ఆర్డీవో విజయకుమారి, ఎంఆర్వో విట్టల్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, ప్రిన్సిపల్ నిఖత్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ నిరసన

**బాన్సువాడ, ఆగస్టు 24(డిడి9 వార్త):**




రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపడుతున్న 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయక పోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.బకాయిలు సకాలంలో అందక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువులు సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చీదురు సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, బీజేపీ కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, ఉమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తృప్తి ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు గురుకుల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, పాశం భాస్కర్‌రెడ్డి, శ్యామల శ్రీకాంత్, కొండని గంగారం, పురుషోత్తం, సచిన్, సందీప్, మహేందర్, ఫణిందర్, భూమేష్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

- రూపారెడ్డి దారుణ హత్యపై 'టీఆర్ఎస్ఎంఏ' నిరసన
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 24(డీడీ9 వార్త) :**




నల్గొండ జిల్లా ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను నిజామాబాద్ జిల్లా తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం తీవ్రంగా ఖండించింది. విద్యాసంస్థలు నిర్వహిస్తూ సమాజానికి సేవ చేస్తున్న మహిళా కరస్పాండెంట్‌పై ఇలాంటి దాడి జరగడం విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంటూ జిల్లా యంత్రాంగానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం మాట్లాడుతూ.. విద్యారంగంలో పనిచేస్తున్న పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు మరియు సిబ్బంది రక్షణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూపారెడ్డి హత్య కేసును అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా దర్యాప్తు చేసి, బాధ్యులందరినీ కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల వద్ద పోలీసు పర్యవేక్షణ పెంచాలని, యాజమాన్యాలు మరియు సిబ్బందిపై వేధింపులు, బెదిరింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక పోలీసు నోడల్ అధికారిని నియమించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్ పాఠశాలల భద్రతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా కార్యదర్శి అరుణ్, జిల్లా కోశాధికారి ఉప్పల మధు, సంఘం ప్రతినిధులు నరసింహారావు, మోహన్, జనార్ధన్, పృథ్వీ, పాఠశాల శ్రీనివాస్, నాగరాజు, రమేష్, ప్రభాదేవి, కవిత, ధర్మరాజు, ఇతర కరస్పాండెంట్లు, ట్రస్మా నాయకులు పాల్గొన్నారు.

# కళాశాలలో అధ్యాపకులు కావాలంటూ విద్యార్థుల ఆందోళన





- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా.. సమస్య పరిష్కరిస్తామని హామీ

**బాన్సువాడ, ఆగస్టు 24(డిడి9 వార్త):**

బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు.సివిక్స్, జువాలజీ సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో సరైన బోధన అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం ఆర్డీఓ రవీందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.గత ఏడాది కాలంగా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని విద్యార్థులు ఆరోపించారు.ముఖ్యంగా సివిక్స్, జువాలజీ సబ్జెక్టులకు వెంటనే అధ్యాపకులను నియమించి, రెగ్యులర్‌గా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.సరైన బోధన అందకపోవడంతో సివిక్స్ సబ్జెక్టులో విద్యార్థులు అధిక సంఖ్యలో ఫెయిల్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత కొన్నేళ్లుగా పలువురు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులు ఇంటర్‌లో ఆశించిన ఫలితాలు సాధించ లేక పోతున్నార ని పేర్కొన్నారు.ముఖ్యంగా బైపీసీ విభాగంలో జువాలజీ లెక్చరర్ లేకుండానే అడ్మిషన్లు కొనసాగించడం వల్ల తమ చదువులు, భవిష్యత్తు దెబ్బతింటున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లుగా జువాలజీ లెక్చరర్ లేకపోవడం వల్ల సబ్జెక్టును పూర్తిస్థాయిలో నేర్చుకోలేకపోతున్నామని తెలిపారు. వెంటనే అర్హులైన అధ్యాపకులను నియమించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని కోరారు.విద్యార్థుల సమస్యలను పరిశీలించిన ఆర్డీఓ రవీందర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి కళాశాలలో అధ్యాపకులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

# హనుమాన్ చాలీసా పారాయణానికి 500 పత్రాల అందజేత




**బాన్సువాడ, ఆగస్టు 24(డిడి9 వార్త):**

బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.దుబ్బాక తాలూకాకు చెందిన హనుమంతుడి ప్రియభక్తుడు, సద్గురు స్వామి సమర్థ మహారాజు గారి శిష్యులు శ్రీనివాస్ కి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించేందుకు 500 హనుమాన్ చాలీసా పత్రాలను లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు.ఈ సందర్భంగా భక్తి, ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంలో హనుమాన్ చాలీసా పారాయణం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని సభ్యులు తెలిపారు.భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేత్రి కిరణ్, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సితలె రమేష్, లయన్ సభ్యులు మేరు భరత్, పత్రికా విలేకరి శ్రీనివాస్‌తో పాటు గ్రామ యువకులు శ్రీకాంత్, పిరయ్య, చందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలపై ముందస్తు చర్యలు

## మిలాద్-ఉన్-నబీ వేడుకల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తం



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లాలో మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.ఈ సందర్భంగా సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, ఇన్‌చార్జ్ డీఐజీ, జోన్-III ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా చర్చించారు.ముఖ్యంగా బందోబస్తు ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది సమన్వయం, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ, ఊరేగింపుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రమాదవశాత్తు యువకుడి మృతి..

## కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కాసుల బాలరాజు



**బాన్సువాడ, ఆగస్టు 24(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణంలోని 13వ వార్డు టీచర్స్ కాలనీకి చెందిన జక్కని రవీందర్ గారి తమ్ముడు జక్కని కిషోర్ నిన్న రాత్రి ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చిన కాసుల బాలరాజు, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖాలీక్, రిటైర్డ్ ఎంఈఓ రబ్బానీ, చిదుర శ్రీనివాస్, మృతుని బంధువులు, టీచర్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ గా తోట లక్ష్మీకాంతారావు బాధ్యతల స్వీకరణ

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24(డిడి9 వార్త):**

తెలంగాణ శాసనసభ మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.శాసనసభలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా కమిటీ చైర్మన్ బాధ్యతలను చేపట్టారు.ఈ సందర్భంగా తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.మైనారిటీ వర్గాల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.మైనారిటీ విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తోట లక్ష్మీకాంతారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518